సమస్యలుంటే సాక్షికి చెప్పండి


మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



సత్యసాయి విద్యావిహార్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–8లోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో టీచర్ తాతా సునీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంటోంది. రామాయణం, భాగవతం, కృష్ణలీలలు, పూరీ రథ యాత్ర, మయాబజార్‌లోని పెళ్లి ఘట్టాలు, దశావతారం వంటి దృశ్యాలను ప్రతిబింబిస్తూ ఈ బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. అడవివరం నుంచి బీఆర్‌టీఎస్ రహదారిలో హనుమంతవాక వైపు ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెలుతున్నాడు. ఆయన నడిపే వాహనం అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. దీంతో కిందపడిన అతడు తల, వీపుపై తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని స్థానికుల సహాయంతో వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

అప్పుఘర్ తీరంలో గుర్తు తెలియని మృతదేహం



వ్యక్తి మృతదేహం

ఎంవీపీకాలనీ: అప్పుఘర్ తీరానికి శుక్రవారం గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతదేహం చేరింది. శుక్రవారం ఉదయాన్నే తీరంలోని అలల మధ్య ఈ మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు లైఫ్‌గార్డ్స్‌కు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని తీరానికి చేర్చారు. అనంతరం ఎంవీపీ పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎంవీపీ పోలీసులు మాట్లాడుతూ మృతదేహం ఎవరిదీ అనేది నిర్ధారణ కాలేదన్నారు. సుమారు 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నల్లని జీన్స్, నల్లని చెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. ఇతడు చనిపోయి 2 నుంచి 3 రోజులై ఉండొచ్చని చెప్పారు.

తీరంలో షూటింగ్ సందడి



లొకేషన్‌లో కృష్ణుడు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ఎర్రమట్టి దిబ్బల సమీపంలో షూటింగ్ సందడి నెలకొంది. హీరో నాగశౌర్య, నటుడు కృష్ణుడిపై పలు సన్నివేశాలు ఇక్కడ చిత్రీకరించారు. ఈ సినిమాకు పేరు ఇంకా ఖరారు కాలేదని, మరో వారం రోజుల పాటు షూటింగ్ ఈ ప్రాంతాల్లో ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.

అంతటా దసరా శోభ

- నేడు విజయదశమి పర్వదినం
- ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు
- వినియోగదారులతో మార్కెట్లు కిటకిట
- ధరాభారంగా పూజా సామగ్రి



జనంతో కిటకిటలాడుతున్న మద్దిలపాలెం కూరగాయల మార్కెట్



మండపంలో కొలువైన కనకదుర్గాదేవి



పీతలవానిపాలెంలో శ్రీకృష్ణ యువజన సంఘం ఏర్పాటు చేసిన దసరా ఉత్సవ మండపం

మద్దిలపాలెం: దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. విజయదశమి సందర్భంగా శనివారం దేవాలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక మార్కెట్లు, బజార్లు దసరా పండగ శోభను సంతరించుకున్నాయి. దుర్గాదేవి పూజలకు కావాల్సిన సామగ్రి విక్రయాలతో కళకళలాడాయి. మద్దిలపాలెం కూరగాయల మార్కెట్, పెదవాల్తేరు, ఎంవీపీ రైతుబజార్లు శుక్రవారం ఉదయం, సాయంత్రం వినియోగదారులతో కిటికిటలాడాయి. దసరా రోజున వాహనాలు శుభ్రపరచుకోవడం పరిపాటి. దీంతో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు వాటర్ సర్వీసింగ్ సెంటర్ల వద్ద వాహనాలు బారులు తీరాయి.

పూజా సామగ్రి ధరలు వామ్మో..

దుర్గాదేవి ఉత్సవాల వేళ.. పూజా సామగ్రి ధరలు దడ పుట్టిస్తున్నాయి. మామిడికొమ్మల కట్ట రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. వాహనాలకు కట్టే దిష్టి నిమ్మకాల దండ ఒక్కొక్కటి రూ.50, యాపిల్, కమల, బత్తాయి, కొబ్బరికాయలు, ఇతర పండ్ల ధరలు భారీగా పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. పువ్వుల ధరలు చూస్తే.. డజను చామంతులు రూ.20 నుంచి రూ.30కు విక్రయించారు. అరటాకులు ఒకటి రూ.5 నుంచి రూ.10, డజను అరటి పండ్లు రూ.80 నుంచి రూ.120, కొబ్బరికాయ రూ.25 నుంచి రూ.40కు అమ్మకాలు జరిపారు. కొనుగోలుదారులతో స్వీట్ షాపులు రద్దీగా మారాయి.

మాంసం ప్రియులకు ఆదివారం పండగే..

మాంసం ప్రియులకు దసరా పండగ ఆదివారమనే చెప్పాలి. వరుసగా శుక్ర, శని, ఆదివారాలు సెలవులు రావడంతో పండగ సందడి ముందే మొదలైంది. దసరా సందర్భంగా నాటుకోళ్ల కొనేందుకు నగరవాసులు ఉత్సాహం చూపించారు. మద్దిలపాలెం కూడలి, శివాజీ పార్కు రోడ్డు, డెయిరీ ఫారం తదితర ప్రాంతాల్లో నాటుకోళ్ల జోరుగా విక్రయించారు. వీటిని కొనేందుకు వినియోగదారులు ఎగబడ్డారు. రెండు నాటు కోళ్ల రూ.2,000 నుంచి రూ.3000 వరకు అమ్మకాలు జరిపారు.

పొట్టేళ్లు సిద్ధం

దసరా సంబరాల్లో జంతు బలి ఆనవాయితీగా వస్తుంది. దీంతో నగరంలో పొట్టేళ్లు, మేకల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.ఒక్కో పొట్టేలు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయించారు. వీటిని కొందరూ ఉద్యోగులు, అపార్ట్‌మెంట్ వాసులు కొనుగోలు చేశారు.

ముఠా కూలీల సందడి

ముఠా కూలీలు ఏడాది పొడవునా నెలవారీగా కూడబెట్టుకున్న డబ్బులతో పొట్టేళ్లు, మేకలు కొనుగోలు చేసుకుంటారు. వాటిని దసరా ముందు రోజు రాత్రి ఎక్కడ బస చేస్తారో అక్కడే వధిస్తారు. అలా కోసిన మాంసాన్ని ముఠాలో ఉన్న వారందరూ సరిసమానంగా వాటాలు వేసుకుంటున్నారు. ఇలాంటి సందడి మద్దిలపాలెం పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డులోను, శివాజీ పార్కు రోడ్డు పక్కన, ఇసుకతోట జంక్షన్‌లో నెలకొంది. ముందుగా పొట్టేళ్లు, మేకలు కొని తీసుకువచ్చి కోసుకునేందుగా సిద్ధంగా పెట్టారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ వీటిని వాటాలు వేసుకుంటారు.



మద్దిలపాలెంలో ముఠా కూలీలు సిద్ధం చేసిన పొట్టేలు

దుర్గాదేవి రూపంలో దీపారాధన

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విజయదుర్గా కాలనీలోని విజయదుర్గాదేవి ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దీపారాధన నిర్వహించారు. దుర్గాదేవి రూపంలో బొమ్మ వేసి దీపాలతో అలంకరించారు. విజయదుర్గా కాలనీ, క్రాంతినగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు దీపాలు వెలిగించి అమ్మవారిని పూజించారు. వివిధ రంగులతో ఈ దీపాలంకరణ స్థానికులు ఆకట్టుకుంది.



విజయదుర్గాదేవి ఆలయం ముందు అమ్మవారి రూపంలో దీపాల అలంకరణ

సాగర్‌నగర్ బీచ్‌లో దేవీ విగ్రహాల నిమజ్జనం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు చోట్ల దేవి విగ్రహాలు ఏర్పాటు చేశారు. వీటిని నిమజ్జనం చేసేందుకు సాగర్‌నగర్ బీచ్‌ను కేటాయించినట్లు ఆరిలోవ సీఐ జి.గోవిందరావు శుక్రవారం తెలిపారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరిలోవ కాలనీ నుంచి రవీంద్రనగర్, డెయిరీఫారం, పెదగదిలి, చినగదిలి, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో దుర్గాదేవి విగ్రహాలను సాగర్‌నగర్ బీచ్‌లో మాత్రమే నిమజ్జనం చేయాలని స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల వారికి ఇక్కడ ఏర్పాట్లు చేశామన్నారు. గతంలో మాదిరిగా జోడుగుళ్లపాలెం బీచ్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయకూడదని హెచ్చరించారు. నిమజ్జనం సమయంలో ఇబ్బంది కలగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా అన్నసమారాధనలు



సింహగిరి కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ హరివెంకటకుమారి



22వ వార్డులో అన్నప్రసాదం అందిస్తున్న పీతల గోవింద్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సింహగిరి కాలనీ కొండవాలు ప్రాంతంలో ఫ్రెండ్లీ యంగ్‌స్టార్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. సింహగిరి కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, పెదగదిలి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక

బలరాం నగర్‌లో..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు బలరాం నగర్‌లో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.



20వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఈస్ట్ షిర్డీసాయి ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో..

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 20వ వార్డు డిఫెన్స్ అపార్ట్‌మెంట్స్ దరి ఈస్ట్ షిర్డీసాయి ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. మహిషాసుర మర్ధినిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, మహిళల ఆధ్వర్యంలో కుంకుమ పూజ, అభిషేకాలు చేశారు.

చండికాదేవికి ప్రత్యేక పూజలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని శ్రీ చండికాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన, మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. పలువురు భక్తులు భక్తి సంకీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ, ప్రతినిధులు శ్రీహరిరాజు, విశాఖ సమాచారమ్ వీరభద్రరావు, ఉమాదేవి, శ్రీనివాసరావు, రామమోహనరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమసదన్‌లో శాకంబరిగా..

ఎంవీపీ కాలనీ సెక్టార్ 8లోని శ్రీ సత్యసాయి ప్రేమసదన్‌లో దుర్గాదేవి శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, శ్రీ అన్నపూర్ణ సహస్రనామార్చన, అభిషేకాలు నిర్వహించారు.



చండికాదేవి ఆలయ పూజల్లో పాల్గొన్న భక్తులు, కమిటీ ప్రతినిధులు

40 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది శుక్రవారం స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు చేపట్టారు. ఒడిశాకు చెందిన నలుగురి బ్యాగుల్లో 40 కిలోల గంజాయిని గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని.. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీ ఎస్ఐ శాంతారాం, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.ఎల్.మీనా తనిఖీల్లో పాల్గొన్నారు.

‘గద్దర్ అన్న యాదిలో..’ పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీకాలనీ: ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్న యాదిలో.. పోస్టర్‌ను ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న విశాఖ పౌర గ్రంథాలయంలో గద్దర్ పాటలు, పోరాటాలను తెలియజేస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గొప్ప పాటలు రాసిన రికార్డ్ గద్దర్‌కు దక్కుతుందన్న ఆయన సాహిత్యం ఈ సమాజంలో ఉన్నంతకాలం గద్దర్ పాటలు, రచనలు సజీవంగా ఉంటాయన్నారు. ప్రజా కళా మండలి, ప్రజానాట్య మండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజా ఉద్యమ అమర కళాకారుల వేదిక, జన చైతన్య మండలి, విశ్వజన కళామండలి, ఉత్తరాంధ్ర సంగీత జానపద కళాపీఠం తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతున్నట్లు చెప్పారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మజ్జి దేవీశ్రీ

పోషకాహారంతో మధుమేహం నియంత్రణ

బీచ్‌రోడ్డు: పండగల సమయంలో పోషకాహారం తీసుకుంటే మధుమేహంతో బాధపడుతున్న వారు ఇబ్బందులకు గురికాకుండా ఉండొచ్చని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి సూచించారు. ఉత్సవాలు, పండగల సందర్భంగా ఆహారం విషయంలో తీసుకోవాల్సిన నియంత్రణపై నగరంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పండగ పిండివంటల్లో బాదం లాంటి పోషకాలు కలిగిన ఆహారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. చక్కెర, కొవ్వులు, కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం అందుబాటులో ఉంటుందని, దానికి మధుమేహం సమస్య ఉన్న వారు దూరంగా ఉండాలని సూచించారు. వాటికి బదులుగా తాజా పండ్లు, కూరగాయలు, బాదం వంటి డ్రై ఫ్రూట్స్‌ను ఆహారంలో చేర్చుకోవాలన్నారు. వీటి వల్ల పలు వ్యాధులు, మధుమేహం వంటివి నియంత్రణలో ఉంటాయని చెప్పారు.

ఇండియన్ స్టూడెంట్ హాస్టల్స్ ట్రస్ట్ సభ్యురాలిగా జెట్సీ

బీచ్‌రోడ్డు: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లండన్‌లో వందేళ్లుగా నిర్వహిస్తున్న ఇండియన్ స్టూడెంట్ హాస్టల్స్ ట్రస్ట్ సభ్యురాలిగా నగరానికి చెందిన జెట్సీ మిరలిన విలియమ్స్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముంబైలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆమెను ట్రస్ట్ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ వైఎంసీఏ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా శుక్రువారం జెట్సీ విలియమ్స్‌ను విశాఖపట్నం వైఎంసీఏ అధ్యక్షుడు కృపాదన్‌కుమార్, సభ్యులు అభినందించారు.



జెట్సీ విలియమ్స్

పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడి

యువకుడిపై పోలీసులకు యువతి ఫిర్యాదు

అల్లిపురం: ప్రేమ, పెళ్లి పేరుతో ఓ యువకుడు నమ్మించి తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని వన్‌టౌన్ పోలీసులకు ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ కేసుకు సంబంధించి సీఐ భాస్కరరావు తెలిపిన వివరాలివీ.. బాధితురాలిది శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల. తన తల్లిదండ్రులతో పండావీధిలో నివాసం ఉంటోంది. ఆమె డిగ్రీ పూర్తి చేసి.. ఇంటి వద్దనే ఉంటోంది. 2020లో తన సోదరుడి స్నేహితుడు గుజ్జు ప్రసాద్‌తో ఇన్‌స్టా గ్రామ్‌లో ఆమెకు పరిచయం ఏర్పడింది. సోదరుడు స్నేహితుడి కావడంతో ఆమె అతని ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను ఆమోదించింది. ఈ క్రమంలో ప్రేమిస్తున్నానని పదే పదే ఆమెకు చెప్పేవాడు. కాగా.. యువతి సోదరుడు 2022లో ప్రమాదవశాత్తు మరణించాడు. దీంతో పెళ్లి చేసుకుంటానని ప్రసాద్ ఆమెను ఒత్తిడి చేయడంతో అంగీకరించింది. అప్పటి నుంచి అతను తరచూ ఆమె ఇంటికి వస్తుండేవాడు. తల్లిదండ్రులు లేని సమయంలో ఆమెతో శారీరకంగా కలిసే వాడు. ఇదిలా ఉండగా ప్రసాద్‌కు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం రావడంతో ట్రైనింగ్ నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడు. 2023లో సెలవులకు ఆమె ఇంటికి వచ్చాడు. అదే ఏడాది డిసెంబర్ నుంచి ప్రసాద్ ఆమెతో మాట్లాడటం మానేశాడు. దీనిపై బాధితురాలు పలుమార్లు ప్రసాద్‌ను అడిగినప్పటికీ అతని నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. చివరికి నీతో పెళ్లి ఇష్టం లేదని చెప్పడంతో ఆమె ఈ విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లింది. వారు ప్రసాద్‌ను హెచ్చరించినప్పటికీ అతను ఆమెతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రసాద్‌పై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో శుక్రవారం 63 స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం బజారు రైతులకు స్టాళ్ల టోకెన్లను ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రైతుల స్టాళ్లకు డ్రా తీసి కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు స్టాళ్ల టోకెన్లు అందిస్తున్న రైతుబజార్ ఈవో కొండబాబు

ముందు జాగ్రత్తలతో క్యాన్సర్ నివారణ

సీతమ్మధార: సీతమ్మధార బాలికల పాపా హోంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ వైద్య శిబిరం నిర్వహించారు. 9 ఏళ్ల నుంచి 14 ఏళ్ల వయసు లోపు 40 మంది బాలికలకు భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్(సర్వైకల్) వ్యాధిన పడకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇంజక్షన్ ద్వారా వేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని, ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1.50 లక్షల ఖరీదైన వ్యాక్సిన్లు బాలికలకు ఉచితంగా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ అధ్యక్షుడు కె.వెంకటరమణ, పాపా హోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు, కార్యదర్శి వి.ప్రకాశరావు, కోశాధికారి రమేష్ చంద్‌జైన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



పాపా హోంలో వ్యాక్సిన్లు వేసుకున్న బాలికలతో, డాక్టర్ మురళీకృష్ణ తదితరులు

నర్సుల ఎన్నికకు చురుగ్గా ఏర్పాట్లు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా యూనిట్ ఎన్నికలు రహస్య బ్యాలెట్ విధానం ద్వారా జరగనున్నాయి. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవికి ఒక్కొక్క పోస్టు ఉంది. పాలకవర్గ సభ్యులుగా ఐదుగురికి ఎన్నికలు నిర్వహించడానికి ఈనెల 16న నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు కేజీహెచ్ నర్సస్ క్లాక్ రూమ్‌లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందని ఎన్నికల అధికారి, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ తెలిపారు. నామినేషన్ల పరిశీలన ఈనెల 17 ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని, 18 సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుందని వివరించారు. ఈనెల 23న ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్‌లో పోలింగ్ జరుగుతుందని, అనంతరం ఓట్ల లెక్కింపు మొదలు అవుతుందన్నారు. రూ.వెయ్యి ఫీజు చెల్లించి నామినేషన్ పత్రాలు స్వీకరించాలని ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు నామినేషన్ ఫీజు రూ.1000, కార్యవర్గ సభ్యుల కోసం రూ. 500 చెల్లించాలన్నారు.